ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

## నర్సాపురంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 29-6-95

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ధర్మ, అర్థ, కామ, మోక్షములు ఇవి పురుషార్థములు. అత్యంత ముఖ్యమైన పురుషార్థము మోక్షము. మొదటిది ధర్మము, చివరిది మోక్షము. మొదటి పురుషార్థము చివరి పురుషార్థముల కంటే మధ్య పురుషార్థముల ప్రభావము ఎక్కువగాఉంది. అర్థ, కామముల ప్రభావము ఎక్కువగా ఉంది. ధర్మముతో కూడిన అర్థము, ధర్మముతో కూడిన కామము వీటి రెండింటిని ఆచరిస్తే మోక్షము నందు ఆపేక్ష కలుగుతుంది.

ఇప్పుడు మనం ఉన్నస్థితి వాస్తవమైనది కాదు. అందుచేత దుఃఖము, అశాంతి వెంటాడుతున్నాయి. మనం ఉన్నస్థితి నిజమయితే దుఃఖము యొక్క స్పర్శ మనకు ఉండదు. అశాంతి ఉండదు.

షిరిడీ బాబాగారు హిందూ, ముస్లిముల సమైక్యతకు కృషి చేసారు. ఆయన కులానికిగాని, మతానికి గాని ప్రాముఖ్యత ఇవ్వలేదు. జ్ఞానమే ప్రధానముగా చెపుతూ ఉండేవారు. అనేక మహిమలు చేసి భక్తులను ఆకర్షించి జ్ఞానం గురించి బోధించేవారు. అక్కడ మహిమలక్ష్యముకాదు. మహిమలు భక్తులను ఆకర్షించటంకోసమే.

షిరిడీ బాబాగారు అత్యంత నిరాడంబరుడు. జ్ఞానము, ఆడంబరము పరస్పర విరుద్ధమైన విషయములు. ఆడంబరము ఉంటే జ్ఞానం లేనట్లు లెక్క. ఒకరు బాబా దగ్గరకు వచ్చి ఆయనకు విష్ణు సహస్రనామము పుస్తకం ఇచ్చి మరల తీసుకొంటాను అని చెప్పి బజారుకు వెళ్ళాడు. అతను విష్ణుసహస్రనామము రోజూ చదువుతున్నాడు. పుస్తకజ్ఞానము ఉంది. జ్ఞానం వచ్చేసింది అనుకొంటున్నాడు. ఈలోపు బాబాగారి దగ్గరకు ఇంకో భక్తుడు వచ్చాడు. బాబాగారు ఆపుస్తకాన్ని ఆ భక్తుడికి ఇచ్చారు. అతను వెళ్ళిపోయాడు. ముందుపుస్తకం ఇచ్చిన భక్తుడు బజారు నుండి వచ్చి బాబాగారిని పుస్తకం గురించి అడిగాడు. బాబాగారు ఆ పుస్తకాన్ని ఇంకో భక్తునికి ఇచ్చాను అని చెప్పారు. అప్పుడు అతనికి చాలా కోపం వచ్చింది. అప్పుడు బాబాగారు అతనితో ఆ పుస్తకాన్ని బజారులో కొనుక్కోలేడని అతనికి ఇవ్వలేదు. అతను బజారులో కొనుక్కోగలడు. నీలోఎంతకోపం ఉందో తెలుసుకుందామని ఇచ్చాను అని బాబాగారు చెప్పారు. సద్గురువు చేసేపని అలా ఉంటుంది. బాబాగారు చేసినపని ఏమిటంటే వాడిలో ఉన్న బలహీనత బయటకుతీసుకొనివస్తేగాని వాడికి తెలియదు. ఈ సంఘటన ద్వారా అతనిలో ఎంత కోపం ఉందో అతనికి తెలియజేసారు. ఆయన చూపించే వరకూ అతనిలో అంతకోపం ఉందని అతనికీ తెలియదు. అతనిలో ఎంతకోపం ఉందో చూపించి దానిలో నుండి విడుదల అవ్వటంకోసం చెప్పవలసినమాటలు చెప్పారు. అది సిద్ధపురుషుల లక్షణము. సిద్ధపురుషులు ఏమి చేస్తారు అంటే వారు ఏ స్థితిలో ఉన్నారో వారిని ఆశ్రయించినవారు కూడా ఆస్థితికి ఎదిగేలా చూస్తారు. ఉన్నది ఒకటే వస్తువు. ఆ వస్తువును అనుభవంలోనికి తెచ్చుకొన్న వాడే సిద్ధపురుషుడు.

మన అందరి దగ్గర చెడ్డ ఏమిటంటే ఇతరులను విమర్శిస్తాము. ఇద్దరు కలిసి మాట్లాడు కొంటూఉంటారు. వీరు ఇద్దరూ మంచివారు అయినట్లు మూడో వ్యక్తిని విమర్శిస్తూ ఉంటారు. ఒకరు బాబాగారి దగ్గరకు వచ్చి ఇంకోవ్యక్తిని విమర్శిస్తూ మాట్లాడుతున్నారు. అప్పుడు బాబాగారు బయట కూర్చొని ఉన్నారు. అక్కడ దగ్గరలోనే ఒక పిల్లవాడు మలవిసర్జన చేసాడు. ఒక పంది వచ్చి ఆమలమును తింటోంది. అప్పుడు బాబాగారు అతనితో నీవు నావంకకాదు చూడవలసినది. అటుచూడు అక్కడ పంది మలమును తింటోంది, నీవు ఎవరినైతే విమర్శిస్తున్నావో వాడి మలమును నీవు తింటున్నావు అన్నారు. వాడి జీవితంలో ఇంకమరచిపోడు. ఆబలహీనత నుండి వాడిని విడుదల చేయటంకోసం బాబాగారు అంత ఘాటుగా చెప్పారు. నేను అనేది ఒకటి వ్యక్తమవుతోంది. ఆ నేను ఎవరో మనకు తెలియటంలేదు. తెలుసుకోవటానికి మనం ప్రయత్నం చేయటంలేదు. ప్రయత్నం చేయాలనే బుద్ధి కూడా నీకు కలగటం లేదు. నేను ఎవరో తెలియకుండా నీకు ఏదీ తెలియదు. మనస్సే నీకు నేనుగా వ్యక్తమవుతోంది. నేను ఎవరు అని ప్రశ్నించటంవలన మనస్సు నిగ్రహంలోనికి వస్తుంది.

ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహము కొంతమందికే పరిమితమైన ఆస్తికాదు. సాధనచేస్తే ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహము మనం కూడా సంపాదించవచ్చును. ఎవరో ఒకరికే సాధ్యం మిగతావారికి ఎవరికీ సాధ్యంకాదు అని అనుకోవద్దు. హృదయంలో ఉన్నవస్తువు అనుభవంలోనికి రావటానికి ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహము అర్హతను కలుగచేస్తాయి.

మాయ అనేది మనస్సుకు వేరుగాలేదు. మనస్సును వదలి వేసి మాయగురించి ఆలోచిస్తాము మాయమనోరూపములో పనిచేస్తోంది. దీనిని మనం గ్రహించాలి. మనస్సే మనకు నేనుగా వ్యక్తమవుతోంది. నువ్వు ఎవరుఅని నీ మనస్సును ప్రశ్నించు. అప్పుడు అది బాహ్యంగా విజృంభించటం మాని అంతర్ముఖం అవుతూ ఉంటుంది. నేను అనే తలంపు అన్ని తలంపులకు తల్లితలంపు. ఎన్ని తలంపులువచ్చినా నేనుకు వస్తాయి. ఇప్పుడు ఏదైతే నీకు నేనుగా వ్యక్తమవుతోందో అది నిజమైతే మనం ప్రశ్నించవలసిన పనిలేదు. అది అబద్ధమైననేను. అందువలన నీవు ఎవరు అని దానిని ప్రశ్నించు. నేను అనే మొదటి తలంపుకు ఇతర తలంపులు వస్తున్నాయి. ఈ మొదటి తలంపు అణిగితే మిగతా తలంపులు అన్నీ అణుగుతాయి గాని మొదటి తలంపు అణగకుండా నీవు ఎంత ప్రయత్నంచేసినా ఇతర తలంపులు అణగవు. ఈ నేను అనేది కూడా ఒక తలంపే. ఇది నిజంకాదు అని తత్వం తెలిసినవాడికి తెలుస్తుంది. ఇది ఉపాధి లేకుండా ఉండలేదు. ఇది దేహమునకు పరిమితమై ఉంటుంది. దీనిని ప్రశ్నించటంవలన దాని మూలంలోనికి వెళుతుంది. అది మూలం లోనికి వెళ్ళేవరకూ దానిని వెంటాడు. దాని మూలంలోనికి వెళ్ళినపుడు అది నశిస్తుంది.

నాకు మోక్షం కావాలి ఏమి చేయమంటారు అని అడిగితే మనం ఇప్పుడు మోక్షంలోనే ఉన్నాము అంటున్నారు భగవాన్. మనకు దేహబుద్ధి ఉంది కాబట్టి దేహము ఎక్కడ ఉంటే అక్కడ ఉన్నామని అనుకొంటున్నాము. మనకు తెలిసినా, తెలియకపోయినా మనం మోక్షంలోనే ఉన్నాము. తెలియటానికి, తెలియకపోవటానికి తేడా ఏమిటంటే తెలిసినవాడికి సుఖము. తెలియనివాడికి దుఃఖము.

రమణమహర్షి హృదయంలో ఏమి ఉందో మనలో కూడా అదే ఉంది. ఇంక ఆయనలో ప్రత్యేకత ఏమిటి అని గాంధీ గారు నెల్లూరు రెడ్డిగారిని అడిగారు. రమణమహర్షికి ఆయన హృదయంలో ఏమి ఉందో ఆయనకు

తెలుసు అందులకు ఆయన ఋషి అయ్యాడు. కాని మన హృదయంలో ఏమి ఉందో మనకు తెలియదు అందువలన మనం ఇలా ఉన్నాము అని రెడ్డిగారు గాంధీగారికి చెప్పారు. మోక్షస్థితి మనలోనూ ఉంది. సాధన చేసి దానిని అనుభవంలోనికి తెచ్చుకుంటే సుఖి అవుతావు. లేకపోతే దుఃఖము నిన్ను వెంటాడుతూ ఉంటుంది.

ప్రతీ సిద్ధపురుషుడు, జ్ఞాని మనలను ప్రేమిస్తారు. వారి ప్రేమలో దోషం ఉండదు. మనదగ్గర నుండి ఏమీ ఆశించరు. ప్రేమించకుండా ఉండలేరు కాబట్టి ప్రేమిస్తారు. ఏ దేవతా పురుషుడు అంటే మనకు ఇష్టమో, ఏ సద్గురువు అంటే మనకు ఇష్టమో వారితో మానసిక అనుబంధము కలిగి ఉండటం ముఖ్యము. దేహం ఎక్కడ ఉన్నా మానసిక అనుబంధము కలిగి ఉంటే అది మన సాధనకు ఎక్కువగా ఉపయోగపడుతుంది.

ధనం సంపాదించాలి అనుకొనేవారు ధనంకోసం ఎలా ప్రయత్నం చేస్తారో, కీర్తిసంపాదించాలి అనుకొనేవారు గౌరవముకోసం ఎలా ప్రయత్నం చేస్తారో మనస్సు పవిత్రం అవ్వటానికి అలాగ ప్రయత్నం చేస్తే తప్పక మనస్సు పవిత్రము అవుతుంది. పూజ, జపము, ధ్యానము మనస్సును పవిత్రం చేయటానికే. బుద్ధిని దోషముల నుండి విడుదల చేయటానికే. సాధనయొక్క ప్రయోజనం కూడా ఇదే. అయితే దీనికి ఏ సాధకుడూ తగినంత ప్రాముఖ్యత ఇవ్వటంలేదు.

మనస్సుకు పవిత్రత లేనపుడు అది బాహ్యముఖంలోనికి వెళుతుంది. మనస్సుకు పవిత్రత వచ్చినపుడు అది అంతర్ముఖమవుతుంది. నీవు బాగుపడినా, చెడిపోయినా దానికి నీ మనస్సే కారణము. నీ మనస్సును పవిత్రము చేసుకుంటే నీవు బాగుపడతావు. నీ మనస్సు విషయంలో శ్రద్ధ చూపించకపోతే నీ మనస్సే నిన్ను పతనం చేస్తుంది. నీ మనస్సే నీకు నిజమైన మిత్రుడు. నీ మనస్సే నీకు నిజమైన శత్రువు. నీ మనస్సు స్వాధీనంలో లేనపుడు ఎదుటివారు సహాయంచేసినా దానిని అందుకోలేవు. నీవు చీకటిలో ఉన్నపుడు పూజలు, జపాలు, యజ్ఞాలు, యాగాలు చేస్తానంటే వెలుతురురాదు. దీపం వెలిగించుకుంటే వెలుతురు వస్తుంది. నీవు అజ్ఞానము నుండి బయటపడాలంటే ఏదైతే సర్వకాలసర్వావస్థలలో ఉందో ఆవస్తువుకు సంబంధించిన జ్ఞానమును సంపాదిస్తే బయటపడగలవు గాని మంత్రాలవలన, యంత్రాలవలన నీకు జ్ఞానంరాదు అంటున్నారు ఆచార్యులవారు.

ప్రతీ మానవుడు వాడి గురించి వాడు తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాడు దేవుడు అంటే శాంతి, ఆనందము. దుఃఖస్పర్శలేని శాంతి నీకు అనుభవంలోనికి వచ్చినపుడు దేవుడు వచ్చినా నీకు చూడాలని అనిపించదు. నీవు దేవుడు కావాలి అంటున్నావు అది నిజంకాదు. నీకు కావలసినది సుఖము, శాంతి. దానికి దేవుడు అని పేరు పెట్టావు. ఇప్పుడు దేహము నేనుగా ఎలావ్యక్తమవుతోందో అలాగ హృదయంలో ఉన్న నిజము నీకు నేనుగా వ్యక్తమయినపుడు నీకు దేవునితో పనిలేదు. ఉన్నవస్తువు అనుభవంలోనికి వచ్చినపుడు బాహ్యంగా ఉన్న దేవుడుతో పనిలేదు. నిజమైన దేవుడు నీ హృదయంలోనే ఉన్నాడు. బాహ్యంగా ఉన్నవి అన్నీ మనం కల్పించుకొన్నవే.

అన్ని మతముల సారము, అన్ని మార్గముల సారము ఆత్మజ్ఞానము. ఆత్మజ్ఞానము వలన ఆత్మ అనుభవంలోనికి వస్తుంది. విద్యలు అనేకం ఉన్నాయి. ఆత్మ విద్యను నేను అని కృష్ణుడు గీతలో చెప్పాడు.

తత్వం అంటే నిజము. నిజం ఎక్కడోలేదు. మనస్సు ఎక్కడయితే ఉదయిస్తోందో అక్కడ నిజం ఉంది.

మనకు అనేక తలంపులు వస్తున్నాయి. ఎక్కడ నుండి వస్తున్నాయి. మనలోపలనుండే వస్తున్నాయి. ఒక తలంపు వస్తుంది. వెళ్ళిపోతుంది. మరల ఇంకోతలంపు వస్తుంది, వెళ్ళిపోతుంది. అవి ఎక్కడికో బయటకు వెళుతున్నాయి అనుకోకు మనలోపలకే ఉపసంహరింపబడుతున్నాయి. అవి ఎక్కడికి withdraw అవుతున్నాయో అదే ఆధ్యాత్మిక హృదయం.

మన హృదయంలో ఉన్న దేవుడు అత్యంత లోభి. అత్యంతలోభి గుణం ఉన్నవాడు ప్రతీ పైసాను ఎలా చూసుకుంటాడో అలాగ మనకు వచ్చే ప్రతీ చిన్న తలంపును ఆయన చూస్తున్నాడు, రికార్డు చేస్తున్నాడు. రాబోయే జన్మలలో మనం వాటికి సమాధానం చెప్పాలి.

పూజ, జపం, ధ్యానము వలన మనస్సు అణిగి ఉంటుంది. అప్పుడు మనకు జ్ఞానం వచ్చేసింది అనిపిస్తుంది. మనస్సు అణగటంవేరు, నశించటంవేరు. అణిగిన మనస్సు మరల దానికి అనుకూల పరిస్థితి వచ్చినపుడు విజృంభించే ప్రమాదం ఉంది. మనస్సు దాని మూలం తెలిస్తేగాని నశించదు. దాని మూలంలోనే నిజం ఉంది. నిజాన్ని చూసిన వెంటనే మనస్సు నశిస్తుంది. హృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకొనేవరకూ మనకు స్వేచ్ఛలేదు.

మనం గాలిని పీల్చుకొంటున్నాము, వదలిపెడుతున్నాము. దీనిని జీవుడు నుండి విడదీయలేము. గాలి పీల్చుకోను, జీవుడు ఉండాలి అంటే ఎలాకుదురుతుంది. ఉండడు. జీవునికి శ్వాసకు ఎటువంటి సంబంధము ఉందో నిజానికి, ఆనందానికి అటువంటి సంబంధము ఉంది. నిజం నీకు అనుభవంలోనికి వచ్చినపుడు ఆనందము లేకుండా ఉండదు. సద్వస్తువు కంటే శాంతి, ఆనందము వేరుగాలేవు. సద్వస్తువు అనుభవంలోనికి వచ్చినపుడు అన్నీ వచ్చి నిన్ను వరిస్తాయి. సత్యాన్వేషణలో ఉన్నప్పుడు మంచి గుణాలు అన్నీ వచ్చి నిన్ను వరిస్తాయి. మంచి గుణాలను ఒకోదానిని మనం సంపాదించనక్కరలేదు.

(మోక్షస్థితి నీ హృదయంలోనే ఉంది. అది నీవై ఉన్నావు. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని నిర్ధేశించే వాక్యము మాత్రమే ప్రమాణ వాక్యము. మిగిలినదంతా మిథ్యాజ్ఞానము అన్నారు ఆచార్యులవారు.) నీ హృదయంలో ఉన్న సత్యమును ఏ వాక్యము అయితే నిర్ధేశించి చెపుతోందో అదే ప్రమాణ వాక్యము.

మోక్షమును పొందటానికి ఉపాసన అవసరము కదా అని అడిగితే ఉపాసన వలన మోక్షం వస్తుంది అని భగవాన్ చెప్పటంలేదు. ఉపాసన అవసరమే. ఉపాసనవలన మనస్సు యొక్క చాపల్యము తగ్గుతుంది అని చెపుతున్నారు.

నీ హృదయంలో ఉన్న నిజం నీకు అనుభవంలోనికి వచ్చేవరకూ ఏదో రకమైన భయం నిన్ను వెంటాడుతూఉంటుంది. ద్వైతం ఉన్నంతసేపు భయం ఉంటుంది. ఉన్నది ఒకటే వుస్తువు. నిజం అనేది ఒకటిగానే ఉంటుంది. అది నీకు అనుభవంలోనికి వచ్చేవరకూ భయం నిన్ను విడిచిపెట్టదు. భయం ఉన్నంత కాలము దుఃఖము తప్పదు.

మనకు బుద్ది ఉంది ఏదో ఒకటి నమ్ముతాము. మనం నమ్మినది నిజం అవ్వాలి అని ఎక్కడాలేదు. కొంత కాలము తరువాత అది నిజంకాదు అని తెలుస్తుంది. అప్పుడు మన బుద్ది దానిని వదలివేస్తుంది. తరువాత ఇంకో

దానిని పట్టుకొంటుంది. తరువాత అదికూడా నిజంకాదు అని తెలుస్తుంది. అప్పుడు దానిని వదలి వేస్తుంది. ఇలా నిజంను తెలుసుకొనే వరకూ బుద్ధి ప్రయాణం చేస్తూనే ఉంటుంది. స్థిరపడదు. ఏ మార్గములో ప్రయాణించినా నీ హృదయంలో ఉన్న నిజాన్ని బుద్ధిగ్రహించే వరకూ జన్మలు తప్పవు. బుద్ధికి తత్వం తెలిసేవరకూ అది ప్రయాణం చేస్తూనే ఉంటుంది. బుద్ధికి నిజంపట్ల పక్షపాతము ఉంది. ఒకటి నిజం అని నమ్ముతుంది. అది నిజంకాదు అని తెలిసిన తరువాత దానిని వదలి వేస్తుంది. ఏమహాగురువు అనుగ్రహం వలననో మనబుద్ధి సత్యంను అనుభవంలోనికి తెచ్చుకుంటే అప్పుడు స్థిరపడుతుంది. అంతవరకూ ప్రయాణం చేస్తూనే ఉంటుంది. అమెరికన్ శాస్త్రవేత్త ఒకరు భగవాన్‌ను చూసివెళ్ళిన తరువాత చెప్పిన మాటలు ఇవి. నేను దక్షిణ భారతదేశంలో ఒక మహర్షిని చూసాను. ఆయనను చూసిన తరువాత దేహంతో సంబంధము లేకుండా నాహృదయంలో ఒక నిజంఉంది అనిపించింది. ఆ నిజము గురించి నాకు తెలియటంలేదు అన్న నిజంకూడా తెలుస్తోంది అని చెప్పారు. చైతన్యస్థాయి ఎంత వరకూ పెరిగిందో అర్థం చేసుకోండి. దేహమునకు అతీతముగా ఒకనిజం ఉంది. దాని గురించి అనుభవంనాకు లేదు. అది నాకు అనుభవంలో లేకపోయినా నాహృదయంలో నిజంఉంది అని తెలుస్తోంది అని చెప్పుతున్నారు. ఇది అంతా మహర్షి ప్రసాదము. అక్కడ ఒక అనుభవాన్ని ఇచ్చారు. సద్గురువులు, మహాత్ముల దర్శనానికి వెళితే ఒట్టి చేతులతో రాము. చైతన్యస్థాయి ఎంతో కొంత పెరుగుతుంది. ఇది బాహ్యమునకు కనబడేదికాదు. విగ్రహారాధన చేస్తున్నాను. దానివలన నాకు చెడ్డ ఏదైనా ఉందా అని అడిగితే దేహమే నీవు అనుకొన్నంత కాలము నీకు చెడ్డ ఏమీలేదు. విగ్రహారాధనకూడా ఏకాగ్రతకోసమే, మనస్సు యొక్క చాపల్యము తగ్గటం కోసమే. దేహమే నేను అనుకొన్నంత కాలము విగ్రహపూజ వలన నష్టంలేదు.

జ్ఞానం కావాలంటే ఇంటిలోని భార్యను, పిల్లలను, పనిని వదలివేయాలా అని అడుగుతున్నారు. వారు నీకు ఏమి చెడ్డచేసారు అని వదలి వేస్తావు అంటున్నారు భగవాన్. నీవు ఎవడివో తెలుసుకోవటానికి ప్రయత్నించు ఇది నీ అంతట నీవు చేసుకొనేకృషి. ఇది నీవు Silent గాచేసుకొనేపని. బాహ్యమైన నీకుటుంబ సభ్యులుగాని, వృత్తిగాని నీకు అపకారం చేయటంలేదు. నీకు అపకారం చేసేది నేనే. అదే నీకు అడ్డువస్తోంది. దానిని తొలగించుకో.

సంసారమును వదలివేస్తాను అంటే సంసారము అంటే ఏమిటో తెలుసుకో అంటున్నారు భగవాన్. భార్య, పిల్లలు, డబ్బు సంసారముకాదు. అహంకారమే సంసారము. భార్యాపిల్లలను వదలివేసినా అహంకారము ఉన్నంతసేపు సంసారము వచ్చేస్తుంది. సంసారములో ఉన్నా ఎక్కడ ఉన్నా జయించవలసింది ఏమిటో చూసుకో, పోగొట్టుకోవలసింది ఏమిటో చూసుకో అంటున్నారు భగవాన్.

మోక్షం ఎక్కడో దూరాన ఉంది అని అనుకోవద్దు. అంతర్ముఖమయిన మనస్సుకు అది అందుతుంది. ఉన్నదేదో నీహృదయంలో ఉంది. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటమే మోక్షము.

నీ హృదయంలో ఉన్న సద్వస్తువును జపించు, దానినే ధ్యానంచెయ్యి, దాని గురించే శ్రవణం చెయ్యి, దానినే మననం చెయ్యి, దానినే జ్ఞాపకం తెచ్చుకో, దాని లోతుపాతులు తెలుసుకో, అప్పుడు అది నీకు లభిస్తుంది. దానిని నీవు ఎన్నుకుంటే అది నీకు లభిస్తుంది. నీ మనస్సుకు ఎంతశక్తి ఉందో, ఎంత ఏకాగ్రత ఉందో అది విడిపోకుండా పూర్ణమైన మనస్సుతో ఆ సద్వస్తువు కోసమే అన్వేషణ చేస్తూఉంటే, దానిని

పొందాలనే కాంక్షతో ఉంటే అప్పుడు అది నీకు తెలియబడుతుంది. ఏ జీవుడయితే కపటంలేకుండా దానికోసం అన్వేషణ చేస్తున్నాడో వాడికి ఆ వస్తువు తెలియబడుతుంది. ఆకాశంలో ఎగరటానికి పక్షికి రెండు రెక్కలు ఎలా అవసరమో, అలాగ హృదయం యొక్క లోతులలోనికి దిగటానికి ఏకాగ్రత, పవిత్రత అనేవి రెండూ అవసరము. అందువలన పవిత్రతకోసం, ఏకాగ్రత కోసం అభ్యాసము చెయ్యి. సాధన యాంత్రికంగా చేయటంకాదు. నీ ప్రయత్నం లేకుండా, నీకు తెలియకుండా ఉచ్వాస, నిశ్వాసలు ఎంతసహజముగా జరుగుతున్నాయో, అంత సహజముగా సాధన జరగాలి. అప్పుడు వస్తువు నీకు లభిస్తుంది.

మనం తీసుకొనే ఆహారం సాత్వికంగా ఉండాలి. సాత్వికాహారమేకదా అని అతిగా తినకూడదు. మితంగా తినాలి. అప్పుడు అది నీ మనస్సు ఏకాగ్రం అవ్వటానికి సహకరిస్తుంది. నీవు చేసే పనిని ప్రేమతో చేస్తే, ఆసక్తి లేకుండా చేస్తే ధ్యానంచేసేవాడు ఏ స్థాయిని పొందుతాడో నీవు కూడా అదే స్థాయిని పొందుతావు. ఫలితంకోసం ఎదురు చూడటం వలన నీ మనస్సు మలినం అవుతుంది. ఆసక్తి లేకుండా పనిచేయటం వలన నీమనస్సు పవిత్రం అవుతుంది. ప్రారబ్దము ప్రకారము నీవు చేయవలసిన పనిని ప్రేమతో చెయ్యి. ఆసక్తి లేకుండా చెయ్యి. అప్పుడు రెండు లాభములు వస్తాయి పనిపూర్తి అవుతుంది, మనస్సు పవిత్రం అవుతుంది. జపంచేసినా, ధ్యానంచేసినా, నిస్వార్థముగా పనిచేసినా ఇవి అన్నీ జ్ఞాన సముపార్జనకు సహకరిస్తాయి. కేవలము మన సాధనను పూజకు, జపంకు పరిమితం చేయకూడదు. సాధన పేరుతో దైనందిన జీవితములో మనం చేసుకొనే పనిని విడిచిపెట్టవలసిన అవసరములేదు. పనిని విడిచిపెడితే అదే మనకు వచ్చే జన్మలో ఎదురవుతుంది.

జ్ఞానమును పొందాలి అనే శ్రద్ధ నీకు ఉంటే, వస్తువును తెలుసుకోవాలనే శ్రద్ధ నీకు ఉంటే అదే నీకు ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహములను తెచ్చిపెడుతుంది. నీకు ఉన్న శ్రద్ధవలన ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహము వస్తాయి. ఎందుకంటే ఇవి లేకపోతే జ్ఞానమురాదు అందువలన ఇంద్రియ నిగ్రహము మనోనిగ్రహంకోసం మనం ప్రయత్నం చేయాలి అనే కాంక్ష నీకు ఉన్న శ్రద్ధ వలన కలుగుతుంది. అప్పుడు వాటికోసం ప్రయత్నం చేస్తావు.

అత్యంత వినయవంతుడిని, అత్యంత శీలవంతుడిని కూడా జ్ఞానం వరిస్తుంది. వారు వెతుక్కుంటూ వెళ్ళనక్కరలేదు. అదే వచ్చి వరిస్తుంది.

అవతారపురుషుల నామమును స్మరించటంవలన, రూపమును ధ్యానించటంవలన మనం నామరూపముల నుండి దూరం అవుతాము. అప్పుడు అహంవృత్తి మనలను విడిచిపెడుతుంది.

ఏకారణము వలన దుఃఖము వచ్చినా మనలో అహంకారము, మమకారము ఉన్నట్లే. అహంకార, మమకార రహితుడిని దుఃఖము ముట్టుకోదు.

దేహప్రారబ్ధం ప్రకారము మనం ఏపని చేయవలసి వచ్చిందో దానిని ఇష్టంతో చెయ్యి, ప్రీతితో చెయ్యి. ఇష్టంతో చెయ్యటంవలన కొత్త వాసనలు పుట్టవు, పాతవాసనలు పోతాయి. అయిష్టంతో చేస్తే కొత్త వాసనలు పుడతాయి. పనిని ఇష్టంతోనూ, ప్రేమతోనూ చేయటంవలన బ్రహ్మానుభవం పొందటానికి ఆ పని సహకరిస్తుంది అని కృష్ణుడు చెప్పాడు.